శరణ్యం

చాగంటి తులసి

పెద్ద చప్పుడు బర్రుబర్రుమని నామీంచి దొర్లుకుంటూ పోయింది. ఒక్క ఊపు ఊపినట్లై మూసుకుపోతున్న కంటిరెప్పల్ని బలవంతాన్ని విప్పిచూసేను. మసగ మసగ్గా కనీ కనిపించని ఆకారాల్ని పోల్చుకునేలోగా కంటిరెప్పలు బరువుగా కిందికి మళ్లా వాలిపోయేయి.

తెలివిగా ఉన్నానా? నిద్రపోతున్నానా? అసలు ఎక్కడున్నాను? చిన్నచిన్న ప్రశ్నలు మగతగాఉన్న మెదడుని కుదిపి కుదిపి లేపుతున్నాయి. నా అవయవాలు నామాట వినటంలేదు. కాళ్లూ చేతులూ బరువెక్కి కదలిక లేకుండా పడి ఉన్నాయి.

ఉన్నట్టుండి కడుపు ఖాళీగా ఉందని తెలిసింది. అవును, నేనేం తిన్లేదు. చిన్నగా జ్ఞాపకం వస్తోంది. అన్నం వండేనా? లేదు. లేదే! అవునవును. అస్సలు కాఫీ కూడా పెట్టుకోలేదు. స్కూలు మంచి వచ్చిందాన్ని......తిన్నగా.......ఇల్లు......ఉహూ అయితే నేను నా గదిలోనే ఉన్నాను. ఇది నా మంచం. ఆ చప్పుడు—ఆః అది ట్రక్కు! వాటర్ వర్క్స్ వాళ్లది. నామీంచి వెళ్లలేదు. నాగది పక్కనుంచి వెళ్లింది. రోడ్డుని ఆనుకున్న గది. రోడ్డునుంచి ఏంవెళ్లినా నా గది లోంచి, నామీంచి వెళ్లినట్టు అనిపిస్తుంది. టైమెంతయిందో? కళ్లు బరువుగా ఉన్నాయి. మండుతున్నాయి. విప్పలేక విప్పలేక కళ్లని విప్పి తల ఎత్తేను. కిటికీలోంచి వాటర్ టవరూ సరిగ్గా టవర్ మీదకి నిండుగా లేచిన చందమామా కనిపించేయి. గదిలోకి వెన్నెల కాంతి కిటికీలోంచి పడుతోంది. ఎత్తిన మొహాన్ని తలగడలో దూర్చేను. రెండు చేతుల్తో తలగడాని పట్టుకుని బోర్లా పడుకోవడం నా అలవాటు. సగం తలగడా గుండెల కిందకి ఉంటుంది. తలగడా తడితడిగా ఉంది. అవును, జ్ఞాపకం వస్తోంది. ఎడతెరిపి లేకుండా వెక్కి వెక్కి ఏడ్చేను. ఏడుస్తూ ఏడుస్తూ ఎప్పుడో మగతలోకి జారిపోయేను.

ఏడ్చిన సంగతి గుర్తుకురాగానే మళ్లా ఉన్నానంటూ దుఃఖం పొంగు కుంటూ వచ్చింది.

'ఏడవకు ఏడవకు! ఏడవకూడదు. ఏడవడం నీ గుణంకాదు. ఏడవకు బుజ్జీ!

ఏడవకు'

నాకు నేనే సముదాయించు కున్నా.

'ఏడకుండా ఉంటావేం? ఏడవక ఏం చెయ్యనూ? ఏడిస్తే ఏడుస్తా. ఏడ వొద్దండానికి నువ్వెవరివి?'

నాలోంచి నన్ను తిడుతూ ఏడుస్తున్న గొంతు వెక్కిళ్లలోకి మారింది.

నేనేమీ అనలేదు. వెల్లకితలా తిరిగి రెండు చేతుల్నీ గుండెలమీద క్రాస్ చేసి పెట్టుకున్నా. నీరసంగా ఉంది. లేవాలని లేదు. కిటికీలోంచి పడ్డ వెన్నెల్లో బట్టల స్టాండు హేంగర్కి వేళ్లాడుతున్న ఎర్ర జరీచీర మెరుస్తోంది. గోడకే ఉన్న అలమరామీదా, అలమరాలో ఉన్న పుస్తకాల మీదా కిటికీ గజాల నీడ పడుతోంది.

అలమరా అరలో పడేసిన 'రూపా' బొమ్మ 'పోనీటేల్' గాలికి ఊగుతోంది. ఆ బొమ్మ కనిపించగానే ఏడుపు స్థాయి మళ్లా పెరిగింది. కళ్ల నిండా నీళ్లు కమ్ముకురావడంతో బొమ్మ అలుక్కుపోయి సరిగ్గా కనిపించడం మానేసింది.

'రూపా! పేరు కూడా ఎం చక్కటిది! షో కేస్‌లో దాన్ని చూసిన రోజు జ్ఞాపకం వచ్చింది. ఆ రోజు ఆ షాప్‌లో ఓసారి దాన్ని తీయించి పట్టుకుని ముట్టుకుని చూసేను. నవ్వుతున్న ఎర్రని పెదాలు, పెంకెతనంతో చూస్తున్న నల్లటికళ్లా, నైలాన్ జుట్టుతో మీదికెత్తి కట్టిన 'పోనీ టేల్', ఓ చెయ్యి పిరాదకెత్తి చూపుడు వేలుతో చూపిస్తూ ఏమిటో చెప్తున్నాది! ఫ్రాక్ బుట్టలాలేచి ఎగురుతోంది. మేజోళ్లా జోళ్లా తొడుక్కుని టిప్‌టాప్‌గా ఉంది. అచ్చుముచ్చు మున్మూర్తులా మున్నిలా ఉంది. మున్నిలా ఉందే అనుకుంటూనే షో కేస్ వేపు చూస్తూ నిలుచుండిపోయేను. చూసి చూసి ఇంక పట్టలేక బొమ్మని పైకి తీయించేను. అటూ యిటూ తిప్పి అన్ని పక్కల్నించీ చూసేను. ఆ అందమైన 'పోనీటేల్'ని పైకి ఎత్తి ఆడించేను. పర్స్‌లో డబ్బుల్లేవు. అయినా యిలాంటి 'డాల్స్' చాలా ప్రియంగా ఉంటాయి. ఎప్పుడూ కొన్లేదు. ఎంతుంటుందో? 'ఎంత'? అని అడిగేను. 'పదిహేను రూపాయిలు' అన్నాడు. రెండూ మూడుకీ రాదని తెలుసు కాని మరీ పదిహేనురూపాయిలా? ఇరవయ్యోతారీఖున పదిహేను రూపాయిలెక్కడ్నించి తేడం? మున్నికోసం పదిహేను రూపాయిలు ఖర్చు పెట్టడానికి వెనకాడతానా?

'ఈ బొమ్మని వేరే ఉంచండి. ఫస్టు తారీఖున వచ్చి తీసుకుంటాను. ఎవ్వరికీ యిచ్చెయ్యకండి'

'అలాగే టీచర్' అని షాప్‌కీపర్ నా ఎదురుగానే కుర్రాణ్ణి పిలిచి 'రూపా'ని లోపల స్టోర్‌లో పెట్టించేడు. షాప్ కీపర్‌కి నేను తెల్సు. వాళ్ల చిన్న చెల్లెలు మా హైస్కూల్లోనే చదువుతోంది.

ఆలోచనలతో, జ్ఞాపకాల మధ్యలో నీటి మబ్బులు చెదిరిపోయేయి. ఏడ్పు సన్నగిల్లి అణిగిపోయింది. నాకు తెలీకుండనే నా ఎడం అరచెయ్యి నుదుటిమీంచీ, కళ్లని రాసుకుంటూ బుగ్గల్ని తుడిచింది.

అసలు ఈ ఊరికి రాకుండా ఉండాల్సింది. వస్తే వచ్చేను కాని ఈ వీధిలో ఉండకుండా ఉండాల్సింది. ఉంటే ఉన్నాను కాని ఎదురింటివాళ్లతో పరిచయం పెంచుకోకుండా ఉండాల్సింది.

అది చెయ్యాల్సింది. ఇది చెయ్యాల్సింది ఇల్లా అనకుండా ఉండాల్సింది. అర్థం పర్థం ఉందా ఈ అనుకోవడానికి? అంతా నా చేతిలో ఉందా ఏం?

'నీ చేతిలో ఉన్నవని నువ్వు చెయ్యొచ్చు బుజ్జీ! ఇంకా ఇక్కడ ఉంటావా? అయిందేదో అయింది. ఇక్కణ్ణించి వెళ్లిపో.'

ఇందాకట్లా ఏడవద్దన్నావ్. ఇప్పుడిక్కణ్ణించి వెళ్లిపో అంటున్నావు! అసాధ్యాల్ని సాధ్యాలకింద మాట్లాడతావు. మహాజ్ఞానివి బయల్దేరేవు బోధపర్చడానికి! ఇక్కణ్ణించి ఎక్కడికిపోతా? ఎన్ని అగచాట్లుపడితే ఈ కమిటీ హైస్కూల్లో ఈ టీచర్ గిరీ దొరికింది! ఎవరన్నా ఎక్కడన్నా బొట్టుపెట్టి పిలిచి పని యివ్వడానికి సిద్ధంగా ఉన్నారా? అమ్మా? అబ్బా?

తప్పదు. బతకాలి. బతకాలి. చావలేక బతకాలి. గత్యంతరం లేక బతకాలి. ఏ కదలికా లేకుండా రాయి లవాలి. అవడం చేతకాకపోతే ఏడవాలి. ఆ ఏడవడమైనా ఘట్టిగా ఏడ కూడదు. ఏడుస్తున్నట్టు ఎవరూ చూడకూడదు. అన్నీ హద్దులు —అన్నీ గీతలు.

'అమ్మా!' అని మూలిగేను. రెండు చేతుల్తో తల పట్టుకుని రెండుకాళ్లనీ పొట్టలోకి పెట్టి మూడంకెలా ముడుచుకు పోయేను. కడుపులోకి కాళ్లు పెట్టుకోగానే నీరసం శరీరమంతా చుట్టుకుంది. నిస్సత్తువతో వళ్లంతా చెమట పట్టింది.

ఇంక లే. ఒక్కసారి లేచి కాస్తంత కాఫీ తాగు. కాఫీ ఎవడు పెడ్తాడంటావా? అయితే పాలే తాగు. పాలు చల్లగా తాగలేవా? సరే, ఆ గ్లాసులో ఉన్న పెరుగు తాగు. లేదూ, కాస్తంత పంచదార నీళ్లలో కలుపుకుని తాగు. పొద్దున్నెప్పుడో మూడు మెతుకులు తిన్నావు. సాయంత్రంకూడా ఏం తిన్లేదు. ప్రాణం కడంటి పోతుంది!

పోతేపోనీ, పీడాపోయింది!

నిజమే, పొద్దున్న స్కూలుకి వెళ్లే తొందరలో భోజనం సరిగ్గా చెయ్యలేదు సాయంత్రం ఇంటికి రాకుండా అట్నించటే తిన్నగా బజారుకి వెళ్లిపోయేను.

రూపాని కొనాలి. మున్నికివ్వాలి. ఒకటే జపం. ఈ ఫస్టుకోసం ఎంత ఎదురు చూసేను. ఫస్టు వచ్చేసినట్టే. ఇంకొక నాలుగురోజులు. మరో మూడు రోజులు.ఏముందీ—రేపే ఫస్టు అనుకుంటూ లెక్క పెట్టుకున్నాను.

ఫస్టు వచ్చింది. వచ్చి ఏడిపించింది ఏడిపిస్తోంది.

ఫస్టేం చేసింది? ఎంచక్క తెల్లారింది. కొండలనుంచీ లేస్తున్న సూర్య బింబాన్ని చూస్తూ కిటికీదగ్గర ఎంత సేపు నిలుచుండిపోయేను. ఎలక్ట్రిక్ తీగ మీద కొండ పిచుకలు కిచకిచ లాడుతున్నాయి. పొడుగ్గా ఉన్న తోకల్ని ఆడిస్తున్నాయి. పొద్దున్న ఎంతో ఉల్లాసంతో స్కూలికి వెళ్లలేదూ?

మరి? మున్ని మున్ని వించే అంతా వచ్చింది.

ఛీఛీ సిగ్గులేదూ? పసిపిల్లని అందులో మున్నినా నువ్వు తిట్టుకునేది? మున్నివే లేకపోతే ఈ ఆరునెలలూ నవ్వుతూ తుళ్లుతూ గడిచేవేనా? ఆ అమ్మాయేకాని దొరక్కపోతే రోజులు ఊదురోమని ఏడ్చేవి.

మున్ని అందంగా ఎందుకుండాలి! చలాకీగా మిలమిలా మెరిసే కళ్లతో కబుర్లెందుకు చెప్పాలి? అన్నీ తెలుసుకోవా

లన్న కుతూహలం అంతెక్కువగా ఎందుకుండాలి? ఉంటే ఉందిపోక నా దగ్గరికి ఎందుకు రావాలి? రోజూ పొద్దున్నా సాయంత్రం నన్ను చూడకపోతే నాతో కబుర్లు చెప్పకపోతే ఎందుకు ఏడవాలి??

ముద్దపప్పులా మొద్దులా ఉన్న పిల్లే అయితే తంటా లేకపోయేది!

నా మొట్టమొదటి స్నేహితురాలు ఆ పసిపిల్లే! కొత్తగా వచ్చేను. ఎవరూ తెలీదు. ఎవరూ తమంతటతాము పలకరించి స్నేహపూర్వకంగా 'ఓహో మీరే నన్నమాట కొత్తగా వచ్చిన టీచర్! మా యింటికి రండి' అని ఆహ్వానించలేదు. ఆ వీధిలో ఉన్న 'అడంగులు' సాయంత్రం వీధిగుమ్మాల్లో కూర్చుని పిచ్చాపాటీ చెప్పుకుంటూ నన్ను ఎగాదిగా చూసి ఊరుకున్నారు. కలుపుగోలుతనంతో నా అంతట నేను పూసుకుని మాట్లాడితే ఏమనుకుంటారో?? ఆ భయంతో ఎవరింటికీ వెళ్ళలేదు ఎవరితోనూ మాట్లాడలేదు.

చెంగుచెంగుమని గెంతుకుంటూ మున్నీ నా దగ్గరికి వచ్చింది. ముద్దు ముద్దు మాటలతో తనెవరో చెప్పింది.

'మలేమో నేను మున్నిని. మీలు ఈ గదిలో ఉంటాలా? అల్లదేం అల్లదే మా యిల్లు. మీలు లాకముందు 'దాదా' ఉండేవాలు.' మున్నీకి 'ర' పలకదు.

నాకు ముందు ఈ ఇంట్లో ఒకబ్బాయి ఉండేవాట్ట. అతణ్ణి మున్నీ దాదా అని పిల్చేదిట. ఉత్తరదేశంలో ఉండిరావడంతో 'చిట్టి' 'చిన్నా' 'బుచ్చి' 'పాపా'కి బదులు మున్ని పేరు 'మున్నీ' అయింది.

మున్నీ నా దగ్గరికి అల్లా రాకపోతే వాళ్లింటికి నే వెళ్లేదాన్నా? వాళ్లతో మాట్లాడేదాన్నా? వాళ్లెవరో, నేనెవరో?

'ఏం లేదు. మున్నీ నీ దగ్గరికి రాకపోతే నువ్వే మున్నీ దగ్గరికి వెళ్ళేదానివి. మున్నీ వాళ్ళమ్మ అన్నమాట అబద్ధమా? పిల్లల దేముంది? ప్రేమతో దగ్గరికి పిలిస్తే; చనువిస్తే నెత్తెక్కి తొక్కుతారు. కసిరితే మర్యాదాంతాలకి రారు. నువ్వే మున్నీని చేరదీసేవు'

నా మీద నాకే కోపం వచ్చింది. ముడుచుకున్న కాళ్లని ఒక్కసారిగా చాచి, మీదదన్ని రెండు చేతుల్నీ మీదకెత్తి పడుకునే ఒళ్ళు విరుచుకున్నాను. బోర్ల పడుకుని తలగడని రెండు చేతుల్లో పట్టుకున్నాను.

చేరదీస్తే చేరదీసేను. అందులో తప్పేముంది. ఆ పాపతో ఆడుకుంటూ పాడుకుంటూ పద్యాలు చెప్పుకుంటూ వాళ్లింట్లోనే సాయంత్రాలు గడిపేను. ఏం? వాళ్ళమ్మామాత్రం వాళ్లమ్మాయి తెలివితేటలకి గొప్ప పడిపోలేదూ?

'మందార మకరంద మాధుర్యమున దేలు' అంటూ మున్నీ పద్యం చెప్తూ ఉంటే ఆవిడ కళ్లు తళతళ్లాడేయి. ఆయనా పొంగిపోయేడు. అందరికీ చెప్పుకుని, అందరి దగ్గరా చదివించి వాళ్ళమ్మాయి విద్యని ప్రదర్శించుకోలేదూ?

'లాయంచ చనునే తలంగిణులకు' కళ్ళు తిప్పుతూ మున్నీ ఎంత అందంగా చెప్తుంది!

అసలు నువ్వు పిచ్చిదానివి. మొదట్లోనే పోల్చుకోవల్సిన సంగతి. వాళ్ళ యిష్టాయిష్టాలవేపు నీ దృష్టే లేదు. నీ సొద నీది. నీ గోల నీది. మున్నీతో ఆడుకోవడమే నీకు తెల్సు. ఎవరేమనుకుంటున్నారో వెనక్కి తిరిగిచూసేవా? ఉహుఁ నీ కంత బుద్ధి ఎక్కడిదీ?

'నే నిక్కడింక ఉండలేను బాబోయ్! నాకు తెలీకుండానే పైకి ఘట్టిగా అన్నాను. నీరసంగా ఉందేమో నా గొంతు నాకే చిత్రంగా వినిపించింది. బుర్రెత్తి కిటికీ వేపు చూసేను. వాటర్‌టవర్ వెన్నెల్లో ఎత్తుగా నిటారుగా ఠీవిగా కనపడుతోంది.

'వాటలు టవలు ఎక్కితే ఆకాశం అందుతుంది కదూ?' మున్నీ ఓ రోజు అంది. ఆవేళ వాటర్ టవర్‌మీంచి పెద్ద హరివిల్లు పొడిచింది

ఏడు రంగులతో ముచ్చటగా ఉన్న హరివిల్లుని చూసి మున్నీ గెంతింది.

'హలివిల్లు! హలివిల్లు! ఆ హలివిల్లు మీదకి ఎక్కి ఇటోకాలూ అటోకాలూ వేసి కూలుచుందాం' వాటర్‌టవర్ మీంచి మున్నీ హరివిల్లు ఎక్కడానికి ప్లాను వేసింది. ఆ రోజు మున్నీని వాటర్‌టవర్ ఎక్కించేను. అంత ఎత్తుమీంచి కిందకి చూసి భయంతో నన్ను కౌగలించుకుంది. ఓ రెండు నిమిషాల్లో భయం పోయి, ఆకాశం ఇంకా ఎత్తుకుపోయిందే అనీ, హరివిల్లు మీదకి ఎక్కడానికి వీల్లేదే అనీ, కిందనున్న ఇళ్ళూ మనుష్యులూ ఇంతింత పిసరున్నట్టున్నారనీ కబుర్లు చెప్పింది. మున్నీకి భావనాశక్తి ఉంది.

వాటర్‌టవర్ వేపు చూస్తూ ఉండిపోయేను. చందమామ కిందికి వాలిపోతున్నాడు. పలచటి మబ్బులు చంద్రుణ్ణి కప్పుతున్నాయి. వెన్నెల కాంతి తగ్గిపోయింది.

గొంతుక తడారిపోయింది. అయినా మంచంమీంచి లేవాలనిలేదు. నాలికతో రెండు పెదిమల్నీ తడుపుకున్నాను.

'రూపాని మున్నీకి యిచ్చేసి రావల్సింది. వెధవపనే చేసేను. వాళ్ళమాటలు వినకుండా ఉండాల్సింది ఘట్టిగా మాట్లాడుకుంటూ ఉంటే దెబ్బలాటలాగ వినపడితే గుమ్మందగ్గర ఆగిపోయి ఎందుకు వినాలి?

నా ఎదురుగుండా ఆయనకాని ఆవిడకాని ఎప్పుడూ ఏమీ అన్లేదే! నే నెలా ఏమన్నా అనుకుంటానూ?

ఆవిడ భయానికి, ఆవిడ తప్పుడు ఊహలకీ నాకు నవ్వే వచ్చింది. ఛీ ఆవిడ యింత తక్కువ బుద్ధిదా? ఆవిడా మున్నికి తల్లి అనుకున్నాను. ఆడబుద్ధి అలాంటిదని ఉత్తినే అంటారా?

మున్ని ముద్దుముద్దుగా పద్యాలు చెప్తూ ఉంటే ఆయనకి మహాసంతోషం కలిగింది.

'నాకా తీరుబడి ఉండదు. ఆవిడికి ఓపికాలేదు, శ్రద్ధాలేదు. మీరు మున్నీకి బాగా దొరికేరు మీరు చెప్పబట్టే కదా దాని కన్నీవస్తున్నాయి' సందు దొరికినప్పుడల్లా పొగుడుతూ ఉండేవాడు.

'వాటర్‌టవర్ ఎక్కించేరా?' ఆవేళ అడిగేరు.

'ఎక్కించక ఏం చెయ్యనూ? మేం యిద్దరం హరివిల్లు ఎక్కి యిటోకాలూ అటోకాలూ వేసి కూలుచుందాం, ఓసారి స్వైలు కొట్టవద్దాం అనుకున్నాం. వాటలు టవలు అంతెత్తుంది కదా—అది ఎక్కేసి అక్కణ్ణుంచి అలుగెక్కినట్టు హరివిల్లు ఎక్కలేమా అని! ఉహూఁ తీరా మేమూ ఎక్కేసరికి ఆకాశం మరీ మీదకి వెళ్లిపోయింది. అందిందే కాదు. మరేం—అటువేపు మబ్బులున్నాయా, అవి బలే మెత్తగా ఉన్నాయి. మనింట్లో ఉన్న డన్లప్పిల్లో కన్నా మెత్తగా ఉన్నాయి. వెన్నముద్దలా ఉన్నాయి. ప్చ్!

అందేయి కాదు. లేపోతేనా?'

మున్నీ చెప్పినట్టు నేను చెప్పేసరికి వినోదం ఎక్కువై ఆయన ఘట్టిగా నవ్వాడు! మున్నీ నవ్వింది. నేనూ నవ్వేను. ఇప్పుడు జ్ఞాపకం వస్తోంది. అప్పుడు ఆవిడ మొహం మాడ్చుకుంది. మున్నీతో ఆడుకోవడంలో పడి ఆవిడ మొహం మాడ్చుకున్నాదన్న సంగతి నే సరిగ్గా గుర్తించలేదు. మున్నీతో సమానంగా చిన్నపిల్లనైపోయి, తక్కులాడి, గెంతుతూ ముద్దుమాటలు మాట్లాడుతూ చుట్టూ ప్రపంచాన్నే మర్చిపోయేను.

ఆవిడ దెబ్బలాట విన్నాక నా కబుర్లూ నా నవ్వూ అంతా ఆవిడకి వేరేగా కని

మీ కుటుంబ ఆరోగ్యముకోసం విటమినులు మరియు ఖనిజములు ఆవశ్యకం.

ఇవి చాలినన్ని వారికి లభించుచున్నవా?



క్రొత్త విమ్‌గ్రన్® మల్టిపుల్ విటమినులు-ఖనిజముల బిళ్లలు!

విటమినులు మరియు ఖనిజముల లోటు మీ కుటుంబ ఆరోగ్యమును పాడుజేయును. అలసట, జలుబు, ఆకలి మందం, నీరసము, చర్మ వ్యాధులు మరియు పళ్ల జబ్బులు...ఇవి ముఖ్యావశ్యకమైన విటమినులు మరియు ఖనిజముల లోటు వల్ల సామాన్యంగా సంభవించుచుండును. బహు జాగ్రత్తమైన శ్రద్ధతో యోచించి తయారుచేయబడు ఆహారములందు సహితము ఇంకా ఈ విటమినులు, ఖనిజములను గురించి తరుచు లోపం కలుగును. ఘనమైన, పుష్టికర ఆహారమంతయు సంతులితమైన ఆహారము కానేరదు. అనేక విధాల ఆహారములందు విటమినులు ఖనిజముల లోటు వుండును, అట్టి సందర్భంలో మీ కుటుంబము ముఖ్యావశ్యకమైన విటమినులు, ఖనిజములు అన్నియు — సరియైన మోతాదులలో పొందుచున్నారని మీరు ఎట్లు నిర్ధారణ చేసుకోగలరు ?

మీ కుటుంబములో ప్రతి ఒక్కరికిన్ని ఈ ముఖ్యావశ్యకమైన పుష్టికర పదార్థములను వారికి కావలసిన మోతాదులలో ధారాళంగా లభించుచుండుటకు వారికి విమ్‌గ్రన్-స్క్విబ్ మల్టిపుల్ విటమినులు-ఖనిజముల బిళ్లలను ఇవ్వండి. రోజుకి ఒక్కటి ఈ ఆరోగ్యకరమైన అలవాటును నేటి నుండియే ఎందుకు ప్రారంభించగూడదు ?

విమ్‌గ్రన్‌తో పదకొండు ముఖ్యమైన విటమినులు, ఎనిమిది ఖనిజములు సరియైన మోతాదులలో వున్నవి. ఎర్రని రక్తకణములను వృద్ధిపరచి శక్తిని కలిగించుటకు ఐరన్, ఎముకలను, పళ్లను దృఢముగా నుంచుటకు కాల్షియమ్, జలుబును నిరోధించే శక్తిని బలపరచుటకు విటమిను సి మంచి నేత్ర దృష్టికి మరియు ఆరోగ్యవంతమైన చర్మమునకు విటమిను ఎ, ఆకలిని పుట్టించి అంతర్యశక్తిని పెంపొందించుటకు విటమిను బి12, అంతేగాక మీ కుటుంబ ఆరోగ్యము నిమిత్తం అవసరమైన ఇంకా యితర ముఖ్యమైన పుష్టికర పదార్థములు గలవు.

విమ్‌గ్రన్ ఒక్క బిళ్ల ఖరీదు సుమారు 13 పైసలు మాత్రమే, మీ కుటుంబ ఆరోగ్యము కోసం నిజంగా బహు స్వల్ప ఖర్చు. ఈ దినమే విమ్‌గ్రన్ కొనండి — ప్రతి దినమూ విమ్‌గ్రన్ తీసుకోండి.

విమ్‌గ్రన్®

విమ్‌గ్రన్ ఒక్క బిళ్లే
దినమునకు
మీకు పుష్టికరం

® ఇ. ఆర్. స్క్విబ్ & సన్స్, ఇన్కార్పొరేటెడ్ వారి రిజిస్టర్డ్ ట్రేడ్ మార్కు, చిహ్నం: దీని కి సెన్స్‌డు ఉపయోగదారులు సారాభాయ్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్.

SQUIBB® SARABHAI CHEMICALS

Shilpi SC 256 TEL

పించిందన్న సంగతి తెలిసింది.

'హుం'

మరో గత్యంతరం లేనిమాట నిజమే— ఇక్కణ్ణుంచి వెళ్ళిపోవాలి. ఎక్కడికి వెళ్ళాలి? ఏం చెయ్యాలి?

ఆవిడలా అన్నందుకా ఏడ్పొస్తు! ఏడుస్తూ ఉంటు! వేసి ఊర్నుంచి వెళ్ళిపోతే ఆవిడ అమ్మయ్య అనుకుంటుంది. వాళ్ళ డెబ్బలాట నేవిన్నట్టూ—ఆవిడకి తెల్సు. నే వెనక్కి తిరిగి వచ్చేస్తూ ఉంటే ఆవిడ చూసింది.

ఊహూఁ, ఆవిడ మాటలకి బాధ కలగలేదు. వెర్రావిడ! ప్చ్! ఆవిడ గొడవ ఆవిడది!

కాని ఆయన అన్నమాటలు??

రూపా బొమ్మ మున్నీ కివ్వడానికి వెళ్ళకపోయి ఉంటే, వాళ్ళిద్దరి డెబ్బలాటా వినకపోయిఉంటే! నామనస్సు నాకు తెలీకుండానే ఉండేదా?

నిజం! పచ్చి నిజం! ఈ నిజాన్ని ఈ పచ్చి నిజాన్ని పదిలంగా వెయ్యి పొరల మధ్యని అట్టడుగుని—నాకే తెలీకుండా ఉన్నదాన్ని ఆయన ఎలా పోల్చేసేడో??

ఏంకాదు—అది నిజంకాదు. అబద్ధం. ఉత్తి భ్రమ. ఉత్తుత్తిదే ఊహించుకుని ఆయన ఆపాదించేడు,

సరే, ఆయన ఉత్తుత్తిదే ఆపాదిస్తే, రూపా బొమ్మని మున్నీకి యివ్వకుండా, మున్నీని చూడన్నా చూడకుండా, వాళ్ళింట్లోకి అడుగుపెట్టకుండా గుమ్మంలోంచే ఎందుకు తిరిగొచ్చేసేనూ? తిండీ తిప్పలూ మాని, వెక్కివెక్కి ఏడుస్తూ సొమ్మసిల్లి నాకు తెలీకుండానే మగతగా ఎందుకు పడుకున్నానూ?

'నీకో గమ్మత్తు యిస్తాను' అంటూ మున్నీని ఈ పదిరోజులూ ఊరించేనే. ఆ పసిపిల్లకి ఆశ పెట్టేనే!

'భగవాన్!'

నిజాన్ని ఎత్తిచూపెడితే గిలగిల్లాడిపోతున్నావ్! నిన్ను నువ్వు మరిపించుకొని నవ్వుతూ ఓ పోజుకొట్టి బతుకుతున్నావనీ నీలోపల ఏంలేదనీ, ఉత్తి డొల్ల అనీ ఆ డొల్లని నింపడం నీతరం కాదనీ బుర్రలో వీసమాత్రమన్నా తెలివున్నవాడు పోల్చేస్తాడు!

కళ్ళుమూసుకుని పాలు తాగితే ఎవరికీ తెలీకుండా ఎలా ఉంటుంది?

నిన్ను నువ్వు మభ్య పెట్టుకుంటావు. పోనీ, మరిపించుకుంటావు. నీకు తెలీనట్టే నువ్వుంటావు. కాని లోలోపల నీకు తెల్సు లోలోపల డొల్ల అనీ గుల్ల అనీ తెలుసు. నీకు భయం! అది ఒప్పుకోడానికి భయం!!

గంభీరమైన దాన్నని, నా కడుపులో రాముడే ఉన్నాడో భీముడే ఉన్నాడో ఎవరికీ తెలీదనీ అనుకుంటావు. ఆ గాంభీర్యం లోతైనది కాదనీ, నీ ప్రతిమాట వెనకా, నీ ప్రతి చేష్ట వెనకాతలా, నువ్వెవరివో ఖచ్చితంగా నువ్వు నువ్వుగా పారదర్శకమై కనిపించి పోతావని నీకు తెలీదు!

'బాబోయ్!' బాధతో మూలిగేను.

ఈ ఊరినుంచి వెళ్ళిపోతాను. మున్నీకి దూరంగా వెళ్ళిపోతాను!

మరో ఊళ్ళో ఇంకో మున్నీ ఉండదా? మరో ఊర్లో ఇంకో మున్నీకి అమ్మా, నాన్నా ఉండరా?

నిజమే! ఏ ఊర్లో అయినా మున్నీలు ఉంటారు! మున్నీల అమ్మలు ఉంటారు! మున్నీల నాన్నలు ఉంటారు!!

కాని నేనా మున్నీలవేపు చూడను. వాళ్ళతో మాట్లాడను. పద్యాలు చెప్పను. వాళ్ళతో ఆడుకోను!

అంటే? రాయివైపోతావా?

కళ్ళనిండా నీళ్ళు నిండుకొచ్చేయి.

'ఆవిణ్ణి నువ్వు అర్థం చేసుకోవేం? అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తే నువ్విలా మాట్లాడవ్' ఆయన అంటున్నాడు.

'నేనేమీ అర్థం చేసుకో అక్కర్లేదు. మీరు చాలా గొప్పగా అర్థం చేసుకున్నారుగా? అది చాలు! ఆవిడ మాటెలా ఉన్నా మీ సంగతి బాగా అర్థం చేసుకుంటున్నా. ఆవిడ వచ్చేసరికి మీ మొహం మెర్క్యురీ దీపంలా వెలిగిపోతుంది. కబుర్లు చెప్పడానికి, ఇంటికప్పు ఎగిరిపోయేటట్టు నవ్వడానికీ ఎక్కడలేని ఓపికా వచ్చేస్తుంది! నే చదువురానిదాన్నే కాని లోకాన్ని బోధపర్చుకోవడం ఎంతసేపూ? ఇలాంటి రకాల్ని యిట్టే పోల్చొచ్చు. నాకళ్ళు తెరుచుకునే ఉన్నాయి. అదిమాత్రం గుర్తుంచుకోండి.'

'ఛీఛీ, ఏవిటా పెడర్థపు మాటలు? తోటి ఆడదాన్ని అలా అనకు! ముఖ్యంగా ఆవిణ్ణేమీ అనకు. నువ్వూ ఆడదానివి! తల్లివి! ఆవిడా నీలాటిదే! మున్నీలాంటి అమ్మాయి ఆవిడకీ ఉండాలని అనిపించదూ?'

'పెడర్థమా? అంటే అంటాను. ఆవిణ్ణెందుకు అలా సమర్థించను పోతున్నారు? అంత పిల్లలే కావాలని ఉంటే నిక్షేపంలా పెళ్ళి చేసుకోమనండి. సలక్షణంగా పిల్లల్ని కనుక్కొని అనుభవించమనండి. అంతేకాని పక్కవాళ్ళ కాపరాల్లో......'

'అన్నీ అందరికీ నిక్షేపంలాగా జరగవు. సలక్షణంగా సాగవు. అలాంటి వాళ్ళలో ఆవిడొకర్తి! నీలాగే నిక్షేపంగా ఉంటే, అవిడకి నీ మున్నీలాంటి మున్నీ ఉంటే ఆవిడ మనింటికి వచ్చేదే కాదు. మున్నీతో ఆడుకునేదీ కాదు. నువ్వు బతిమాలినా మున్నీకి పద్యాలు చెప్పేదీ కాదు! ఆవిడకో యిల్లంటూ ఉంటే నీ యిల్లూ నీయిల్లూ ఎందుకు తిరుగుతుందీ? నీ పిల్లనీ నీ పిల్లనీ దగ్గరికి తీసుకుని ఎందుకు ఆడుకుంటుంది? పాపం ఆవిడ కింతకంటే శరణ్యం లేదు. నో ఎస్కేప్! ఏంచేస్తుందీ? అర్థం చేసుకో. అంతేకాని అభాండాలు రుద్దకు. పెడర్థపు మాటలు మాట్లాడకు!'

ఇంక వినలేక గిర్రుని వెనక్కి తిరిగి వచ్చేసేను. నిజం నిజం! ఆయన నిజాన్ని పట్టుకున్నాడు.

ఒంటరితనాన్ని పోగొట్టుకోడానికి లోలోపల ఏరోజు కారోజు పెరిగిపోతున్న శూన్యాన్ని కృత్రిమంగా నింపుకోడం కోసం మున్నీతో ఆడుతున్నాను!

తీర్చడానికి వీల్లేని లోటుని మరిచిపోడానికి మున్నీతో ఆడుతున్నాను!

ఈ నిజాన్ని అట్టడుగున జాగ్రత్తగా నాక్కూడా కనిపించకుండా దాచేసుకున్నాను! నన్ను నేను మభ్యపెట్టుకున్నాను!

కళ్ళు ఘట్టిగా మూసుకున్నాను.

'ఆవిడ కింతకంటే శరణ్యం లేదు. నో ఎస్కేప్!' ఆయన మాటలు గింగురుమంటున్నాయి, చెవుల్లో హోరు పెడుతున్నాయి. మొహం తిరుగుతున్నట్టనిపించింది కాళ్ళూ చేతులూ తొక్కర్లా వేళ్ళాడిపోతున్నాయి. తలని తాళ్ళవేసి బిగించి కట్టేసినట్టుంది. గుండెలమీద పెద్ద బరువు పెట్టినట్టుంది. కళ్ళ చీకట్లు కమ్ముతున్నాయి.

'నో ఎస్కేప్! నో ఎస్కేప్!'

నా గుండెలమీంచి బర్ బర్ మని చప్పుడు చేసుకుంటూ వాటర్ వర్క్స వాళ్ళ ట్రక్కు వెళ్తోంది!! ●